మా కలం.. మీ గళం..
RNI : APTEL/ 2017/74310
# మన గళం
దిన పత్రిక
పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 08 సంచిక : 107 బుధవారం 01 - 10 - 2025 పేజీలు: 8 వెల: 4

## అన్న క్యాంటీన్లపై పర్యవేక్షణ తప్పనిసరి



3లో..

## నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ



మన గళం, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల ఆర్థిక ప్రగతికి 'పూర్వోదయ' పథకం కింద ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన నేడు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమై ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ఈ నిధులే కీలకమని ఆయన నొక్కిచెప్పారు.

2 లో..

## బాలకృష్ణపై 300కు పైగా కేసులు పెట్టేందుకు సిద్ధమైన ఫ్యాన్స్



మన గళం, హైదరాబాద్ : సీనియర్ నటులు చిరంజీవి, బాలకృష్ణ మధ్య తలెత్తిన వివాదం మరింత ముదరకుండా సద్దుమణిగింది. బాలకృష్ణపై కేసులు పెట్టేందుకు సిద్ధమైన అభిమానులను స్వయంగా మెగాస్టార్ చిరంజీవి వారించడంతో పెద్ద గొడవ సద్దుమణిగినట్లయింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలలో చిరంజీవి పేరును ప్రస్తావించడం

2 లో..



## భారత్ వైపు చూస్తున్న అమెరికా టెక్ కంపెనీలు

### - కీలకమైన, ఉన్నత స్థాయి పనులు ఇండియాకు తరలింపు

మన గళం డెస్క్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠినమైన హెచ్-1బీ వీసా నిర్ణయాలు, భారత టెక్ రంగానికి పరోక్షంగా మేలు చేసేలా కనిపిస్తున్నాయి. వీసా నిబంధనలను కఠినతరం చేస్తుండటంతో, అమెరికన్ కంపెనీలు తమ కీలకమైన ప్రాజెక్టులను, ఉన్నత స్థాయి పనులను భారత్‌లోని తమ కార్యాలయాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ పరిణామం దేశంలోని గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) అభివృద్ధికి మరింత ఊతమిస్తుందని ఆర్థిక నిపుణులు, పారిశ్రామిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇటీవల ట్రంప్ సర్కార్ కొత్త వీసా దరఖాస్తు ఫీజును ప్రస్తుతం ఉన్న 2,000-5,000

2 లో..

## జోగుళాంబ అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

మనగళం, కర్నూలు సిటీ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున తెలంగాణ రాష్ట్రం, అలంపూర్ క్షేత్రంలో వెలసిన శ్రీ జోగుళాంబా సమేత బాలబ్రహ్మేశ్వర స్వామి, అమ్మవార్లకు కర్నూలు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పట్టువస్త్రాలను సమర్పించారు. మంగళవారం అమ్మ,స్వామివారిని జిల్లా కలెక్టర్ దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. తొలుత బాలబ్రహ్మేశ్వర స్వామికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్ కు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం వేద పండితులు వేదాశీర్వచనంతో తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోగులాంబ అమ్మవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున ప్రతి ఏటా పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీని పాటిస్తూ, జోగుళాంబా సమేత శ్రీబాలబ్రహ్మేశ్వర స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించడం జరిగిందన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా ప్రజలందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. స్వామి, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కలెక్టర్ వెంట దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.సుధాకర్ రెడ్డి, అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





## 2023లో పెరిగిన సైబర్ నేరాలు.. తగ్గిన హత్యలు




మన గళం, న్యూఢిల్లీ : నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో 2023 నేరాల రిపోర్టును రిలీజ్ చేసింది. దేశంలో 2023లో 27,721 మర్డర్ కేసులు నమోదు అయినట్లు ఆ నివేదిక పేర్కొన్నది. 2022తో పోలిస్తే ఇది 2.8 శాతం తక్కువ అని తెలిసింది. అయితే ఎస్టీలపై నేరాలు పెరిగినట్లు ఎన్‌సీఆర్‌బీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ ఏడాదిలో ఎస్టీలపై 28 శాతం నేరాల సంఖ్య పెరిగినట్లు చెప్పింది. ఇక సైబర్ నేరాల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2023లో

2 లో..

## అమ్మవారి వెండి రథాన్ని ప్రారంభించిన టీజీ





మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు నగరంలోని పూల బజారులో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో భక్తుల సహకారంతో రూపొందించిన వెండి రథాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం వెండి రథానికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వెండి రథం ఆలయం లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే దేవి శరన్నవ రాత్రి వేడుకలను పురస్కరించుకొని సరస్వతి దేవి అవతారంలో అలంకరణలో ఉన్న అమ్మవారిని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ దర్శించుకుని పూజా కార్య క్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వాయుగండ్ల సుబ్బారావు, చిలుకూరు నందకి షోర్,మారం శ్రీనివాసులు, కొండ నాగరాజు, ద్వారకా నాథ్, సాయిబాబా, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## పత్తికొండలో ఘోర రోడ్డు ప్రమాదం

### - ముగ్గురు మృతి...ఇద్దరికి తీవ్ర గాయాలు

మనగళం, పత్తికొండ : కర్నూలు జిల్లా పత్తికొండలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పత్తికొండ టౌన్ గుత్తి సర్కిల్ నుండి సాయిబాబా గుడి దగ్గరలో మిట్టపై బియ్యం లోడ్ తో వెళ్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. లారీ మిట్టమీద ఉండడంతో వెనుకకు వచ్చింది. లారీ వెనుక ఆగి ఉన్న ఆటోలను ఢీకొట్టింది. తుగ్గలి మండలం ముక్కెల గ్రామానికి చెందిన భూమిక, శిరీష, వితుక అక్కడికక్కడే మృతి చెందారు. మృత దేహాలను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దసరా పండుగ సందర్భంగా పత్తికొండకు సరుకులు తీసుకోవడానికి వచ్చిన శిరీష, భూమిక, కుమార్తె వితుక చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మరో సంవత్సరం అబ్బాయి ప్రాణాపాయం నుండి బయటపడ్డాడు. భూమిక భర్త సుమన్ భార్యతోపాటు కూతురు చనిపోవడంతో కన్నీటి మున్నీరయ్యాడు. మృతదేహాలను చూసి విలపించాడు.



## నా పై ప్రతీకారం తీర్చుకోండి

### - ప్రజలను మాత్రం ఇబ్బంది పెట్టొద్దు



మన గళం, చెన్నై : కరూర్ తొక్కిసలాట ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని టీవీకే పార్టీ చీఫ్, హీరో విజయ్ తెలిపారు. ఈ ఘటనతో తన గుండె ముక్కలైందన్నారు. ఈ ఘటనతో తనకు మాటలు సైతం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో నిజం వెలుగులోకి వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తమిళనాడులోని కరూర్‌లో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనపై విజయ్ తొలిసారి స్పందించారు. అందుకు సంబంధించిన వీడియోను

2 లో..

## ట్రంప్ తీరుతో కీలకమైన భారత్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది



మన గళం, ఇంటర్నెట్ డెస్క్: రష్యా నుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్న చైనాను వదిలి, కేవలం భారత్‌పై టారిఫ్ పేరుతో ఆంక్షలు విధించడం సరికాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరును ఆ

# భారత్ వైపు చూస్తున్న అమెరికా టెక్ కంపెనీలు

డాలర్ల నుంచి ఏకంగా లక్ష డాలర్లకు పెంచింది. దీనికి తోడు, సోమవారం కొందరు యూఎస్ సెనేటర్లు -1 వీసా ప్రోగ్రామ్‌లలోని లోపాలను సరిదిద్దేందుకు ఓ కొత్త బిల్లును కూడా ప్రవేశపెట్టారు. ఈ పరిణామాలతో అమెరికాలో విదేశీ నిపుణులను నియమించుకోవడం కంపెనీలకు మరింత వ్యయభరితంగా, సంక్లిష్టంగా మారింది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించిన సంస్థలు, భారత్‌లోని తమ జీసీసీలను ఆశ్రయిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీలలో సగానికి పైగా, అంటే దాదాపు 1,700 సెంటర్లు ఒక్క భారత్‌లోనే ఉన్నాయి. ఇవి కేవలం టెక్ సపోర్ట్ కేంద్రాలుగా మాత్రమే కాకుండా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, సైబర్‌సెక్యూరిటీ, అనలిటిక్స్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ వంటి అత్యంత కీలకమైన విభాగాల్లోనూ పనిచేస్తున్నాయి. ఈ విషయంపై డెలాయిట్ ఇండియా భాగస్వామి రోహన్ లోబో మాట్లాడుతూ, "ఈ సమయంలో జీసీసీలు చాలా కీలక పాత్ర పోషించనున్నాయి. ఇప్పటికే పలు అమెరికన్ కంపెనీలు తమ వర్క్‌ఫోర్స్ వ్యూహాలను పునఃసమీక్షిస్తున్నాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ సర్వీసులు, టెక్నాలజీ రంగాల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది" అని వివరించారు.

అనేక కంపెనీలకు జీసీసీలను ఏర్పాటు చేయడంలో సహాయపడిన ఏఎన్ఎస్ఆర్ వ్యవస్థాపకుడు లలిత్ అహూజా కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "ఈ మార్పుపై కంపెనీల మధ్య తీవ్రమైన చర్చ జరుగుతోంది. త్వరగా నిర్ణయాలు తీసుకోవాలనే ఆత్రుత కనిపిస్తోంది" అని ఆయన తెలిపారు. నిపుణుల అంచనా ప్రకారం, వీసా నిబంధనలు ఇలాగే కొనసాగితే, అమెరికాలోని వ్యూహాత్మక ఉద్యోగాలు సైతం భారత్‌కు తరలిరావడం ఖాయంగా కనిపిస్తోంది.

# నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ

దేశంలోని తూర్పు ప్రాంతాల్లో ఉన్న రాష్ట్రాల సమగ్ర అభివృద్ధి కోసం పూర్వోదయ పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఏపీపై దృష్టి పెట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పూర్వోదయ పథకంలో భాగంగా బీహార్, జార?ండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేశారు. పూర్వోదయ నిధులతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. రాయలసీమలో హార్టికల్చర్, ఉత్తరాంధ్రలో కాఫీ పంట ఉత్పత్తులు, జీడి, కొబ్బరి తోటలు, కోస్తాంధ్రలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సీఎం తన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగాల్లో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం పూర్వోదయ పథకంలో నిధులు కేటాయిస్తే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎకనమిక్ డెవలప్మెంట్ కు పూర్వోదయ పథకం అమలు ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. వెనుక బడిని ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి దోహదం చేసేలా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ ను కోరారు. అనంతరం కేంద్ర జలశక్తి శాఖామంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. పోలవరం



పనుల పురోగతిని గురించి కేంద్రమంత్రికి సీఎం వివరించారు.

# బాలకృష్ణపై 300కు పైగా కేసులు పెట్టేందుకు సిద్ధమైన ఫ్యాన్స్

వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ చిరంజీవి ఇప్పటికే ఓ ప్రకటన కూడా విడుదల చేశారు. ఈ పరిణామంతో ఆగ్రహానికి గురైన మెగా అభిమానులు బాలకృష్ణపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించారు. అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన అభిమాన సంఘాల ప్రతినిధులు అత్యవసరంగా సమావేశమయ్యారు. బాలకృష్ణ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన వారు, రెండు రాష్ట్రాల్లోని 300కి పైగా పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదు చేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు. దీనికి తొలి అడుగుగా హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఈ విషయం చిరంజీవి దృష్టికి వెళ్ళింది. వెంటనే ఆయన అభిమాన సంఘాల నాయకులకు ఫోన్ చేసి, కేసుల నిర్ణయాన్ని విరమించుకోవాలని సూచించారు. "అలా కేసులు పెట్టడం మన సంస్కారం కాదు, ఆవేశంతో అలాంటి పనులు చేయకూడదు" అని వారికి నచ్చజెప్పారు. చిరంజీవి మాటతో అభిమానులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించిన అభిమాన సంఘాల నాయకులు, "బాలకృష్ణ వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. మొదట కేసులు పెట్టాలని భావించినా, చిరంజీవి గారి సూచన మేరకు వెనక్కి తగ్గాం. ఆయన మాటకు మేం కట్టుబడి ఉంటాం. అయితే, భవిష్యత్తులో మా అన్నయ్యపై ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే



మాత్రం సహించేది లేదు" అని స్పష్టం చేశారు. మొత్తం మీద, చిరంజీవి సమయోచితంగా జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

## 2023లో పెరిగిన సైబర్ నేరాలు..

# తగ్గిన హత్యలు




సైబర్ నేరాల సంఖ్య 31.2 శాతం పెరిగినట్లు రిపోర్టులో పేర్కొన్నారు. ఆ ఏడాది 86,420 సైబర్ నేరాలు నమోదు అయ్యాయి. 2022లో ఆ సంఖ్య 65,893గా ఉంది. 2022లో దేశవ్యాప్తంగా 28,522 మర్డర్ కేసులు నమోదు అయినట్లు ఎన్‌సీఆర్బీ రిపోర్టులో పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి లక్ష మంది జనాభా ఆధారంగా నేరాల రేటును విశ్లేషిస్తారు. దేశంలో జువినైల్ నేరాల సంఖ్య కూడా పెరిగింది. 2023లో దేశవ్యాప్తంగా 31,365 జువినైల్ కేసులు నమోదు అయ్యాయి. 2022తో పోలిస్తే ఆ కేసుల సంఖ్య 2.7 శాతం పెరిగినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో జువినైల్ క్రైం అత్యధికంగా ఉన్నది. దేశవ్యాప్తంగా 2022లో 6.9గా ఉన్న జువినైల్ నేరాలు సంఖ్య 2023లో 7.1 శాతానికి పెరిగినట్లు ఎన్‌సీఆర్బీ డేటా పేర్కొన్నది.

# తమిళనాడులో ఏపీ యువతిపై అత్యాచారం

మన గళం, ఇంటర్నెట్ డెస్క్: తమిళనాడు రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తిరువన్నమలై(అరుణాచలం)లో ఏపీకి చెందిన ఓ 18 ఏండ్ల యువతిపై తమిళ పోలీసులు కామంతో చెలరేగిపోయారు. తన సోదరి ముందే నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. అత్యాచారం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎంథాల్ బైపాస్ వద్ద నిన్న రాత్రి టమాటా లోడ్‌తో వెళ్తున్న ఓ గూడ్స్ వాహనాన్ని ఇద్దరు కానిస్టేబుల్స్ ఆపి తనిఖీలు చేశారు. తనిఖీల సందర్భంగా ఆ వాహనంలో ఉన్న యువతిపై పోలీసులు కన్నేశారు. అనుమానం ఉందంటూ దబాయిస్తూ.. ఆ యువతిని కొట్టి కిందకు దింపారు. తన సోదరి ముందే.. ఆమెను పక్కనే ఉన్న పంట పొలాల్లోకి బలవంతంగా లాక్కెళ్లారు ఇద్దరు కానిస్టేబుల్స్ సుందర్, సురేశ్ రాజ్. అనంతరంపై ఆమెపై విరుచుకుపడ్డారు. బాధితురాలి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. స్థానికులు అక్కడికి వచ్చేలోపు పోలీసులు పరారీ అయ్యారు. బాధిత యువతిని అంబులెన్స్‌లో తిరువన్నమలై ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అప్రమత్తమైన పోలీసులు.. బాధితురాలిని ఆస్పత్రిలో విచారించారు. ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అయితే తన సోదరితో కలిసి అరుణాచలం దైవదర్శనానికి వచ్చినట్లు ఆమె పేర్కొంది. అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్ల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.

# నా పై ప్రతీకారం తీర్చుకోండి

హీరో విజయ్ మంగళవారం విడుదల చేశారు. తనపై అమిత ప్రేమతో ప్రజలు ఈ సభకు తరలి వచ్చారన్నారు. బాధిత కుటుంబాలను త్వరలో పరామర్శిస్తానని ఈ సందర్భంగా విజయ్ వెల్లడించారు. ప్రజల భద్రతకే తాను ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. తనను టార్గెట్ చేయండి.. అంతేకానీ ప్రజలను మాత్రం ఇబ్బంది పెట్టొద్దంటూ తన ప్రత్యర్థులకు టీవీకే చీఫ్ విజయ్ సూచించారు. తమ తప్పు లేకపోయినా.. తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎప్పుడూ తనకు ఎదురు కాలేదని ఆయన గుర్తు చేసుకున్నారు. కావాలనుకుంటే తనపై ప్రతీకారం తీర్చుకో వచ్చంటూ తమిళనాడు సీఎం స్టాలిన్‌కు విజయ్ సవాల్ విసిరారు. కానీ తన పార్టీ కార్యకర్తల జోలికి మాత్రం వెళ్లకండంటూ వారికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటన కరూర్‌లోనే ఎందుకు జరిగింది? అంటూ విజయ్ సందేహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఎలా జరిగిందో తనకు ఇప్పటికీ అర్థం కావట్లేదన్నారు. కరూర్ ఘటన కారణాలు ఒక్కొక్కటిగా తెలుస్తున్నాయని ఈ సందర్భంగా విజయ్ పేర్కొన్నారు. అయితే తమకు అనుమతి ఇచ్చిన ప్రాంతంలోనే సభ నిర్వహించామని విజయ్ గుర్తు చేశారు.

# మత్స్యకారులకు మంత్రి అచ్చెన్న కీలక సూచన

## - చేపల వేట సమయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలి

మన గళం, అమరావతి : చేపల వేట సమయంలో చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని మత్స్యకారులకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. శ్రీలంక నావికా దళం విడుదల చేసిన ఏపీకి చెందిన నలుగురు మత్స్యకారులు మంగళవారం అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు కలిశారు. తమ విడుదల కోసం ప్రభుత్వం చేసిన కృషి చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. శ్రీలంక నుంచి ఈ మత్స్యకారులు.. కాకినాడ స్వస్థలం చేరుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి వారు పాలాభిషేకం చేసి.. ఆనందం వ్యక్తం చేశారు. తమ విడుదలకు సహాయ సహకారాలు అందించిన మంత్రి అచ్చెన్నాయుడికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు.. ఈ ఏడాది ఆగస్టు మాసం ప్రారంభంలో వ్యాపార నిమిత్తం తమిళనాడులోని నాగపట్టణం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు.. శ్రీలంక ప్రాదేశిక సముద్ర జలాల్లోకి ప్రవేశించారు. దీంతో వారిని శ్రీలంక నావిక దళ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఈ అంశాన్ని మత్స్యకారుల కుటుంబ సభ్యులు.. రాజ్యసభ సభ్యుడు, టీడీపీ నేత సానా సతీష్ ద్వారా వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. సీఎం చంద్రబాబు వెంటనే రంగంలోకి దిగి న్యూఢిల్లీలోని ఏపీ రెసిడెన్స్ కమిషనర్ అర్జా శ్రీకాంత్‌కు కీలక ఆదేశాలు జారీ చేశారు. న్యూఢిల్లీలోని శ్రీలంక ఉన్నతాధికారులతో వరుస భేటీలు నిర్వహించి.. వారిని విడుదల చేసేందుకు మార్గాన్ని సుగమం చేశారు. అనంతరం వారు ఇటీవల న్యూఢిల్లీ చేరుకున్నారు. ఆ తర్వాత వారి స్వస్థలం కాకినాడకు చేరుకున్నారు. వారు ఇంటికి చేరుకోవడంతో.. ఆ కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లువిరిసింది. దాంతో తమ విడుదలకు సహకరించిన



ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా మత్స్యకారులు పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

# ట్రంప్ తీరుతో కీలకమైన భారత్‌ను కోల్పోయే ప్రమాదం ఉంది

దేశ మాజీ జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ విమర్శించారు. భారత్ విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న విధానాన్ని ఆయన తప్పుబట్టారు. చైనా, రష్యాను విడిచిపెట్టి కేవలం భారత్‌పై సుంకాలు విధించడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సుంకాలను వాణిజ్యం గురించి కాకుండా వ్యక్తిగత కక్షతో విధిస్తున్నట్లుగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ట్రంప్ అనాలోచిత నిర్ణయాల వల్ల అమెరికా ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామిని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ కొన్ని లక్ష్యాలతో రెండోసారి అధికారంలోకి వచ్చారని, అందుకోసం ఆయన దేనికైనా సిద్ధమవుతున్నారని విమర్శించారు. అమెరికా రాజకీయాల్లో ఏమాత్రం ఆమోదయోగ్యం కాని విధంగా ఆయన వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. అమెరికాలో గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి పరిస్థితులు రాకూడదని జాన్ బోల్టన్ ఆకాంక్షించారు.

## హిందూ ధర్మానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

మన గళం, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం హిందూ ధర్మానికి, సంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 5,600 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాల కోసం రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని విడుదల చేస్తున్నామని ఆయన ప్రకటించారు. నెల్లూరులో మీడియాతో మాట్లాడిన మంత్రి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూ ధర్మానికి సంబంధించిన హామీలను వేగంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మరిన్ని వివరాలు వెల్లడిస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా 600 మంది వేద విద్యార్థులకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అర్చకులకు రూ.15 వేలు, దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులకు రూ.25 వేల చొప్పున భృతిని కల్పిస్తున్నామని వివరించారు. దేవాలయ ట్రస్ట్ బోర్డులలో నాయీబ్రాహ్మణులకు సభ్యులుగా అవకాశం కల్పించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించామని పేర్కొన్నారు. దేవాలయాల ఆస్తుల పరిరక్షణ తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని మంత్రి ఆనం ఉద్ఘాటించారు. ఇందుకోసం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, డీజీపీలతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# అన్న క్యాంటీన్లపై పర్యవేక్షణ తప్పనిసరి

- మూడు పూటలా తనిఖీ చేయాలి
- ఆహార నాణ్యతలో రాజీ పడొద్దు
- కోఆర్డినేటర్లకు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశం





మనగళం, కర్నూలు కార్పొరేషన్ : నగరంలోని ఐదు అన్న క్యాంటీన్లపై కోఆర్డినేటర్ల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని, ప్రతి రోజు మూడు పూటలా స్వయంగా తనిఖీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం ఆయన పరిమళ నగర్, ప్రభుత్వ ఆసుపత్రి, సెట్కూరు కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు అందించే అన్నపూర్ణ భోజనంలో ఎటువంటి రాజీ ఉండకూడదని, ఆహార నాణ్యతను మూడు పూటలా కచ్చితంగా పరిశీలించాలని సూచించారు. వడ్డించే సమయం, పరిసరాల పరిశుభ్రత, పాత్రల శుభ్రత, శ్రద్ధగా ఆహారం వడ్డించడం అన్నీ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వద్ద వర్క్ ఇన్స్పెక్టర్లు తప్పనిసరిగా ఉండాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సెంట్రల్ ప్లాజా వద్ద పెయింటింగ్ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, అక్కడ వర్క్ ఇన్స్పెక్టర్ అందుబాటులో లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# ఉరుసులో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు



మనగళం, కర్నూలు సిటీ : కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలంలోని పంచలింగాల గ్రామంలో నిర్వహించిన సయ్యద్ సైఫుల్లా షా ఖాద్రి ఉరుసులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎంపీ దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు దర్గాకు చేరుకున్న ఎంపీ కి దర్గా నిర్వహకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకుడు మొహమ్మద్ రఫీ, దర్గా నిర్వాహకులు షబ్బీర్, షహీన్, మున్నా, ఖాదర్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు మాంసం విక్రయాలు నిషేధం

మనగళం, కర్నూలు కార్పొరేషన్ : గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీని మాంసం విక్రయాలు నిషేధమని కర్నూలు నగర పాలక సంస్థ అధికారులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కర్నూలు నగరంలోని కబేళాలు, మాంసము దుకాణములు మూసివేయాలని సూచించారు. ఎక్కడ కూడా జంతువులను వధించరాదని, మాంసం విక్రయించరాదన్నారు. అదేవిధంగా హోటల్స్, రెస్టారెంట్లలోనూ మాంసం విక్రయించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ జరిమానాతో వ్యాపార లైసెన్స్ ను రద్దు చేస్తామన్నారు.

# రోడ్డు ప్రమాద ఘటనపై ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా పత్తికొండ లో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాద ఘటన పై ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడు ప్రమాదం పై సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఆయన గాయపడిన వారికి మెరుగైన చికత్స అందించాలని సూచించారు. ఆగి ఉన్న ఆటోను లారీ ఢీ కొట్టిన ఘటన లో ఇద్దరు మహిళలతోపాటు ఒక చిన్న పాప చనిపోవడం తన మనసును తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామంలో మట్టి మిద్దె కూలి ఇద్దరు మృతి చెందిన ఘటన పై కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాత్రి నిద్రిస్తున్న సమయంలో మట్టి మిద్దె కూలి తండ్రి, కొడుకు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడటం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం తరుపున ఆదుకుంటామన్న ఎంపీ మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు.

# ఎస్ టి యు కోడుమూరు మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అభినందన సన్మానము



మన గళం కోడుమూరు: ఎస్ టి యు కోడుమూరు మండల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అభినందన సన్మానము జరిగినది. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది నవ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులై నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి నైతిక విలువలతో కూడిన విద్యను అందించి సమ సమాజ మార్పునకు కృషి చేయాలని ఎస్ టి యు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి సిహెచ్ తిమ్మన్న జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గోకారి టికే జనార్ధన్లు కోరారు కోడుమూరు పెన్సనర్ల భవనం ఆవరణలో మంగళవారము ఉదయం ఎస్ టి యు అభినందన సభ సన్మాన కార్యక్రమం తాలూకా ఎస్టీయు సీనియర్ నాయకులు ఆర్.విక్టర్ అధ్యక్షతన జరిగినది .ఈ సమావేశంలో కోడుమూరు మండల పరిధిలో ఎంపికైన 25 మంది నూతన ఉపాధ్యాయులను దుశ్శాలువ, పూలమాల , ఎస్టీయు బ్యాగులతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి శ్రీ హెచ్ తిమ్మన్న ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ గోకారి మరియు టికే జనార్ధన్, మాజీ ప్రధానోపాధ్యాయులు రాఘవ రెడ్డి హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తులలో అన్నిటికన్నా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సమయపాలన అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో సత్సంబంధాలను ఏర్పరచుకొని నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు విద్యార్థులకు బోధన మాత్రమే పరిమితం చేయకుండా వారి మనసులను గైకొని వారి అవసరాలను వారి అభివృద్ధికి నిరంతరం సూచనలను సలహాలను అందిస్తూ సమాజంలో మంచి పౌరులుగా ఉన్నత స్థానాలకు ఎదగడానికి కృషి చేయాలన్నారు. తదుపరి కోడుమూరు తాలూకా పరిధిలో వివిధ గ్రామాల నుండి మెగా డీఎస్సీ 2025 లో విజయం సాధించి నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు ప్రశాంతి,సంధ్య, నాగరత్నమ్మ, పద్మావతి, సుధాకర్,షాకీర్, గిరి,రాఘవేంద్ర ఆచారి, గిడ్డియ, వీరందరికీ దుశా లావువ,పూల మాల లతో అభినందన సన్మానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎస్టియు నాయకులు విక్టర్, శ్రీనివాసులు,వెంకటేశ్వర్లు, తిరుమల రెడ్డి, రిటైర్డ్ హెడ్మాస్టర్ రాఘవరెడ్డి, రాజశేఖర్, ఏఐఎస్ఎఫ్ రంగస్వామి పాల్గొన్నారు.

# వాల్మీకి సంఘం నాయకులు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి కరపత్రాలు విడుదల.



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో పట్టణంలో అక్టోబర్ 7 వ తేదీ జరిగే వాల్మీకి జయంతిను ఘనంగా నిర్వహించాలని కోరుతూ కోడుమూరు లో వాల్మీకి జయంతి కరపత్రాలను వాల్మీకి సంఘం నాయకులు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వాల్మీకి విగ్రహం వద్ద కరపత్రాలు విడుదల చేశారు. అక్టోబర్ 7 వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు పూజ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా స్లో సైకిల్, ముగ్గుల పోటీలు, గోనే సంచి తో పరిగెత్తే పోట్లు, బాలికల తాడుతో జంపింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను అక్టోబర్ 7 వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను వాల్మీకి విగ్రహం నుండీ ప్రారంభమై చౌడేశ్వరి దేవాలయం వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘం కమిటీ సభ్యులు లాయరు ప్రభాకర్, బలరాం, మహేష్, మధు, రాజు, శ్రీను, బచ్చు గిద్దయ, నాగరాజు, మద్దిలేటి, నగేష్, లక్ష్మన్న, చంటి, మాదన్న, సంజూ, శివ, అనిల్, రాముడు, అశోక్ తదితరులు పాల్గోన్నారు.

# గొర్రెల మందపై దూసుకెళ్లిన కారు

- కాపరితోపాటు 20 గొర్రెలు మృతి



మనగళం, కల్లూరు : కర్నూలు జిల్లా కల్లూరు మండల పరిధిలోని ఉల్లిందకొండ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరితోపాటు 20 గొర్రెలు మృతి చెందాయి. ఉలిందకొండ హైవే లో గొర్రెలను దాటిస్తుండగా కారు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. 20 గొర్రెలతోపాటు కాపరి ఎల్లరాముడు(49) మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ సీనియర్ నాయకుడు, నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి గౌరు వెంకట రెడ్డి ఘటన ప్రదేశానికి వెళ్లారు. ప్రమాదం తీరుపై ఆరా తీశారు. గొర్రెల కాపరి ఎల్లరాముడు కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# గొర్రెల కాపరి మృతి చెందడం పై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎంపీ



మనగళం, కల్లూరు : ఉలిందకొండ హైవే పై జరిగిన రోడ్డు ప్రమాదంలో 20 గొర్రెలతో పాటు కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కురువ ఎల్ల రాముడు మృతి చెందడం పై కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉలిందకొండ హైవే లో గొర్రెలను దాటిస్తుండగా కారు ఢీ కొన్న ప్రమాదంలో గొర్రెలు, కాపరి మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ ఘటనను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి మృతి చెందిన గొర్రెలకి నష్ట పరిహారం ఇప్పించడంతో పాటు, కురువ ఎల్ల రాముడు కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని ఎంపీ తెలిపారు.

# వర్షానికి కూలిన మట్టిమిద్దె.. తప్పిన ప్రమాదం.





మన గళం బనగానపల్లె : నంద్యాల జిల్లా బనగానపల్లె లో గత 4 రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పట్టణంలోని కొండపేట కాలనీలో దివ్యాంగుడు సంపత్ కుమార్ అనే వ్యక్తి బాడుగ కు నివాసం ఉంటున్న మట్టి మిద్దె కూలింది. బాధితుల కథనం మేరకు పట్టణంలోని కొండపేట కాలనీలో అద్దె ఇంట్లో తల్లిదండ్రులతో ఉంటున్న సంపత్ కుమార్ కు ఎన్టీఆర్ భరోసా పెన్షన్, తండ్రి వెంకటేశ్వర్లకు వయో వృద్ధుల పెన్షన్ తీసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా బనగానపల్లెలో కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పైకప్పు నుండి మట్టి రాలుతూ ఉండడం గమనించిన తల్లిదండ్రులు సంపత్ ను పక్కకు తీసుకొని వస్తున్న క్రమంలో ఒక్కసారిగా మట్టిమిద్దె కూలింది. దీంతో దివ్యాంగుడు అయినా సంపత్ కుమార్ కు స్వల్ప గాయాలు కావడం జరిగింది. ఇంట్లో ఉన్న వస్తువులు సామాగ్రి, బట్టలు ఇతర వస్తువులు నేలమట్టమై ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వ స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు కోరుకున్నారు.

## 20 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే కోట్ల





మన గళం బేతంచెర్ల మండలంలోని మారుమూల గ్రామాలైన హుస్సేనాపురం, తవిసికొండలకు గత 20 సంవత్సరాలుగా బస్సు సౌకర్యం అందుబాటులో లేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రారంభించింది. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా డోన్ ఎమ్మెల్యే శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తవిసికొండ, హుస్సేనాపురం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ఊర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరగా, ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు, ఈరోజు నుంచి బనగానపల్లె నుండి బేతంచెర్ల, రంగాపురం, గుటుపల్లె మీదుగా హుస్సేనాపురం, తవిసికొండ గ్రామాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ,గత వైసీపీ ప్రభుత్వం కాలంలో బస్సు సౌకర్యం కల్పించాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లగానే వెంటనే పరిష్కారం చూపడంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# అదుపు తప్పి కాలువ లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు.

మన గళం సంజామల : నంద్యాల జిల్లా సంజామల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం మలుపు వద్ద కోవెలకుంట్ల ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న సైడ్ కాలువ లోకి దూసుకుపోయి ప్రహరీ గోడను ఢీ కొట్టింది.

వివరాల్లోకి వెళితే

కోయిలకుంట్ల కు చెందిన ఆర్టీసీ బస్సు సంజామల,తిమ్మనాయనపేట మీదుగా అనంతపురం జిల్లా తాడిపత్రికి బయలుదేరింది. సంజామల ఎంపీడీవో కార్యాలయం మలుపు వద్ద కు రాగానే ఎదురుగా వస్తున్న బైకును తప్పించబోయి పక్కనే ఉన్న సైడ్ కాలువ లోకి దూసుకెళ్లి ప్రహరీ గోడను బలంగా ఢీ కొట్టి బస్ ఆగిపోవడం జరిగింది. ఈ ప్రమాదంలో బస్సులో కూర్చున్న ప్రయాణికులు కేకలు,అరుపులతో భయభ్రాంతులకు గురి కావడం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు లేకుండా ప్రాణాలతో బయటపడి ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.



# దసరా నవరాత్రుల ఉత్సవాలలో పాల్గొన్న కోట్ల





మన గళం, బేతంచెర్ల దసరా నవరాత్రుల పవిత్ర సందర్భంగా బేతంచర్ల పట్టణంలోని అమ్మవారిశాల ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో గౌరవనీయులు డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరాత్రులు శక్తి ఆరాధనకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆరోగ్యం, ఐశ్వర్యం, అభ్యున్నతి కలగాలని ఎమ్మెల్యే ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని ఉత్సాహంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

## బకాయిలతో ఎంఎస్ఎంఈల ఉనికి ప్రశ్నార్థకం

మన గళం, దేశ ఆర్థికవ్యవస్థకు ఎంఎస్ఎంఈలు వెన్నెముక అయినప్పటికీ వినియోగదారుల(ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, దుకాణాలు, ప్రైవేటు వ్యక్తులు)నుంచి రావాల్సిన బకాయిలు సకాలంలో వసూలు కాకపోవడం వాటి అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. గ్లోబల్ అలయన్స్ ఫర్ మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(జీఏఎంఈ) అంచనా ప్రకారం 2024లో ఎంఎస్ఎంఈలకు రావాల్సిన బకాయిలు రూ.10.7 లక్షల కోట్లని, అందులో సుమారు 80శాతం సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల వాటా ఉందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఎంఎస్ఎంఈల ఉనికి ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఎంఎస్ఎంఈల బకాయిలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈలకు రావాల్సిన బకాయిల వసూళ్ల కోసం రూపొందించిన సమాధాన్ పోర్టల్‌లో ఇప్పటివరకు 2,54,360 కేసులు నమోదు కాగా, వాటిలో కేవలం 50,803 మాత్రమే పరిష్కరించబడినట్లు చెప్పారు. ఎంఎస్ఎంఈలు మనుగడ సాగించాలంటే వేగవంతమైన, సమర్థవంతమైన పరిష్కార పద్ధతులు అవసరమని స్పష్టంచేశారు.

## రోడ్డు ప్రమాద ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి టీజీ భరత్



మనగళం, కర్నూలు సిటీ : కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చనిపోవడం తనను ఎంతో బాధ కలిగించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులను ఆదేశించారు.

## డోన్ మండల పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి డీఎస్పీ.





మన గళండోన్ మండలంలో కురుస్తున్నవర్షాల కారణంగా పాత ఇళ్లు, బలహీనమైన గోడలు కూలిపోయే అవకాశం ఉండడంతో ఇలాంటి ఇళ్లలో నివసిస్తున్న వారు జాగ్రత్తలు తీసుకుని తాత్కాలికంగా సురక్షిత ప్రదేశాలకు వెళ్లవలసిందిగా సూచించబడుతున్నది.

2. గ్రామాల్లో వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున ఎవ్వరూ వాటిని దాటే ప్రయత్నం చేయకూడదు. ఎక్కడైనా నీరు ముంచెత్తే పరిస్థితులు లేదా ప్రమాద సూచనలు కనబడితే వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించి రక్షణ చర్యలు తీసుకునేలా సహకరించవలసిందిగా కోరబడుతున్నది.

3. ప్రజల ప్రాణాలు మించినవి ఏవి కావు. కాబట్టి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, పోలీసుల సూచనలకు అనుగుణంగా సహకరించవలసిందిగా కోరడమైనది.

# పటిష్టంగా ఆర్థిక వృద్ధి




మన గళం, భారత్ దీర్ఘకాలిక రుణ రేటింగ్‌ను స్థిరమైన ఔట్‌లుక్‌తో యథాతథంగా 'బీఏఏ3'గా కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తెలిపింది. ఆర్థిక వృద్ధి పటిష్టంగా ఉండటం, అంతర్జాతీయంగా వాణిజ్యం, చెల్లింపులకు సంబంధించి మెరుగైన స్థితిలో ఉండటం, తదితర అంశాలు ఇందుకు కారణమని సంస్థ వివరించింది. ఇవన్నీ కూడా అమెరికా టారిఫ్‌ల భారం, తయారీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ఎదురవుతున్న అవాంతరాలు మొదలైన అంతర్జాతీయ ప్రతికూల పవనాలను ఎదుర్కొనే బలాన్ని అందిస్తున్నాయని పేర్కొంది. దేశీయంగా భారీ మార్కెట్, జనాభా తీరుతెన్నులపరంగా సానుకూలతలాంటి అంశాలు .. అంతర్జాతీయ షాక్‌ల నుంచి దేశీ ఎకానమీకి రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు, జీడీపీ వృద్ధి అధిక స్థాయిలో ఉండటం, ఆర్థిక స్థిరీకరణ వంటి అంశాలనేవి భారీ స్థాయిలో ఉన్న ప్రభుత్వ రుణభారాన్ని నెమ్మదిగా తగ్గించుకోవడానికే తోడ్పడతాయే తప్ప ఎకాయెకిన తగ్గించుకోవడానికి ఉపయోగపడకపోవచ్చని తెలిపింది. పైగా వినిమయాన్ని పెంచే దిశగా ఇటీవల తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయానికి కొంత గండి పడుతుందని, దీంతో రుణభారాన్ని అదుపులో ఉంచుకోవడం కష్టంగా మారొచ్చని మూడీస్ వివరించింది. ఇటీవలే ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ సంస్థ 18 ఏళ్లలో తొలిసారిగా భారత్ సార్వభౌమ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసింది. 'ట్రిపుల్‌బీ మైనస్' నుంచి ట్రిపుల్ బీ'కి పెంచింది. అటు జపాన్‌కి చెందిన రేటింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ (ఆర్‌అండ్‌ఐ) కూడా దీర్ఘకాలిక సావరీన్ రేటింగ్‌ను ట్రిపుల్ బీ నుంచి ట్రిపుల్ బీ ప్లస్‌కి పెంచింది. ఇక మార్నింగ్‌స్టార్ డీబీఆర్ఎస్ సైతం ట్రిపుల్ బీ (కనిష్ట) నుంచి ట్రిపుల్ బీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

ఉద్యోగాల భర్తీలో ప్రజాప్రభుత్వ చిత్తశుద్ధి..

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మొదలైన నాటి నుండి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చాలా చిత్తశుద్ధితో వ్యవహరిస్తోంది. అందుకు ఉదాహరణే 60 వేల ఉద్యోగాల నియామక పత్రాల అందజేత. గత ప్రభుత్వ ఏలుబడిలో ఉప ఎన్నికలు వస్తే గానీ ఉద్యోగాలు గుర్తుకు రావు. ఒక వేళ నోటిఫికేషన్ ఇచ్చినా, దాంట్లో ఎన్నో కొర్రీలను సాకుగా చూపించి వ్యవహారం అంతా అప్పటి టీఎస్‌పీఎస్సీ, కోర్టుల మధ్యనే నలిగేటట్లు చేశారు. న్యాయ, సాంకేతిక పరమైన చిక్కులను పట్టించుకోకపోగా జిరాక్స్, జాబ్ కన్సల్టేషన్ సెంటర్లలో ప్రశ్న పత్రాలను అమ్ముకున్న దౌర్భాగ్య పరిస్థితులను చూశాం. విద్యార్థుల జీవితాలను ఆగం చేసి వారిని సామాజికంగా, ఆర్థికంగా కుంగుబాటుకు గురిచేసి ఈరోజు కొంతమంది రాజకీయ నిరుద్యోగులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ విద్యార్థి, నిరుద్యోగుల మీద రాజకీయం చేస్తోంది. దశాబ్దకాల పరిపాలనలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క డీఎస్సీని నిర్వహించకుండా తండా, గూడాలు, మారుమూల పల్లెల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల మూసివేతకు కారణమయ్యారు. దీంతో ఇంగ్లీష్ విద్యతోనే భవిష్యతు ఉందని భావించి పేదవాళ్లు వారి పిల్లలను ప్రైవేటు బడులలో చదివించసాగారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ ఆర్థిక భారాన్ని వాళ్లు అలవాటు చేసుకోవాల్సి వచ్చింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే 11,062 పోస్టుల నోటిఫి కేషన్ జారీ చేసి పరీక్షలను నిర్వహించిన 3 నెలలలోపే నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేసి ప్రభుత్వ పాఠశాలల పునరుత్తేజానికి దోహదపడి చరిత్ర సృష్టించింది. కేజీ టూ పీజీ నాణ్యమైన ఉచిత విద్య అని మోసం చేసిన వారికి ఈ విషయం జీర్ణం కాకపోవచ్చు. కానీ పేద బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగిందనేది వాస్తవం. ఎల్బీ స్టేడియం వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టాఫ్ నర్స్, జేఎల్, డీఎల్, పోలీస్, టీచర్స్, ఏఈఈ, గ్రూప్-4, ఏఈ, ఏఈఓ(అగ్రికల్చర్), రెవిన్యూ(జీపీఓ)... ఇలా 60 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలను అందించి తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగుల్లో ఒక బలమైన విశ్వాసాన్ని నెలకొల్పారు. ఈ అన్ని ఉద్యోగాలు ఏదో ఒక కారణంగా కోర్టుల చుట్టూ తిరిగుతుంటే టీజీపీఎస్సీకి దిశానిర్దేశం చేయించి న్యాయపరమైన చిక్కులు వాటిపైన లేకుండా సీఎం చొరవ తీసుకున్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనేవి తెలంగాణకు ఒక పెద్ద భావోద్వేగ అంశం. కానీ దాన్ని కేవలం వారి కుటుంబానికి సంబంధించిన అంశంగా మార్చుకున్న గత పాలకులు ఈ రోజు వారి మధ్య జరగాల్సిన నియామకాల కోసం కుటుంబంలో వారికి వారే కొట్టుకుంటున్నారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభ్యర్థులకు ఇచ్చి ప్రజా పాలనలో వారిని భాగస్వాములను చేద్దామని ప్రయత్నిస్తుంటే పదేళ్లు నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ ఒకవైపు, సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల పేరిట పంగనామాలు పెట్టిన బీజేపీ మరోవైపు.. సోషల్ మీడియా ద్వారా కొంతమంది రాజకీయ నిరుద్యోగులను ఉసిగొల్పి, వారికి అన్ని రకాల సహాయ సౌకర్యాలను అందిస్తూ నిజమైన అభ్యర్థులను భీతిల్లేలా చేస్తున్నాయి. అందులో భాగంగా గ్రూప్-1 ఉద్యోగాలు 3 కోట్లకు అమ్ముకున్నారని గత ఏలుబడిలో పేపర్లు అమ్ముకున్న కీలక మాజీ మంత్రి విమర్శించారు. 563 పోస్టులకు గాను లెక్కగట్టి 17 వందల కోట్ల లావాదేవీలు జరిగాయని గుడ్డిగా విమర్శించారు. ఇదే విషయాన్ని గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రులు ప్రెస్ క్లబ్ వేదిక నుంచి, ఆధారాలు ఉంటే చూపియండని గట్టిగా అడిగే సరికి మాజీ ఐటీ మంత్రి తోకముడుచుకున్నారు.

నిరుద్యోగుల భుజాలపై తుపాకీ పెట్టి ప్రజా ప్రభుత్వాన్ని కాల్చాలనుకునే వారి కుటిల నీతిని తెలంగాణ ప్రజలు గమనిస్తూ ఉన్నారు. గ్రూప్-1 ఉద్యోగాల విషయంలో హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జిమెంటును డివిజన్ బెంచ్ జడ్జిలు సస్పెండ్ చేసిన తరుణంలో కోర్టు చాలా స్పష్టంగా చెప్పిన విషయం ఏమిటంటే ఆధారాలను ప్రధాన అంశంగా చూడకుండా కేవలం పిటిషనర్ చెప్పిన నోటి వ్యాఖ్యలనే అంశాలుగా పరిగణలోకి తీసుకొని జడ్జిమెంట్ ఇవ్వడం కరెక్ట్ కాదని, ఈ జడ్జిమెంట్‌లో శాస్త్రీయత లోపించిందని కోర్ట్ తేల్చి చెప్పేసింది. అక్రమాలు జరిగాయని అభ్యర్థులు ఎలా చెబుతున్నారు? వాటికి ఆధారం ఏమిటి? పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయా? మాస్ కాపింగ్, లికేజ్ జరిగిందా? పక్షపాతంతో వ్యవహరించారా? తదితర అంశాలపై ఆధారాలతో స్పష్టత ఇవ్వాలని హైకోర్టు ఘాటుగా ప్రశ్నించింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసిన తరువాత బోర్డులో ఎటువంటి తప్పిదాలు జరిగినా ఉపేక్షించమని అధికారులను దిశానిర్దేశం చేసి, ఒక నిజాయితీ గల ఐఏఎస్ ఆఫీసర్ అయిన బుర్రా వెంకటేశంని చైర్మన్‌గా నియమించారు. గ్రూప్-1,2,3 నియామకాలు త్వరితగతిన జరిగిపోతే కొత్త నోటిఫికేషన్‌ని జాబ్ క్యాలెండర్ ద్వారా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న సందర్భంలో ప్రతిపక్షాలు ఈ విషయాన్ని ఓర్వలేక లక్షలు ఫండింగ్ చేసి ఒక వర్గ నిరుద్యోగులను రెచ్చగొట్టి నిజమైన అభ్యర్థులను భయభ్రాంతులకు గురి చేయడం తెలంగాణ సమాజాన్ని మోసం చేయడమే.. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థి లోకం కూడా ఈ రాజకీయ నిరుద్యోగుల వలలో చిక్కు కోకుండా జాబ్ క్యాలెండర్ ద్వారా భర్తీ అయ్యే ఉద్యోగాలతో అర్హతను పొంది ప్రజా పాలనలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాం.

# కోడుమూరు మండలంలో సంధ్య విక్రమ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కండువా కప్పుకున్న పలు గ్రామాల గ్రామస్తులు



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లాలోని కోడుమూరు మండలంలోని పలు గ్రామాల్లో జనసేన సంధ్య విక్రమ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు కోడుమూరు నియోజవర్గం కోడుమూరు మండలం అనుగొండ, ముడుమాలకుర్తి ,వెంకటగిరి మరియు కొత్తూరు గ్రామస్తులు పెద్ద ఎత్తున జనసేన పార్టీలో చేరినట్లు సంధ్య విక్రమ్ కుమార్ తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడుమూరు నియోజవర్గంలో జనసేన పార్టీ రోజురోజుకీ బలపడుతుందని ప్రతి ఒక్కరూ పార్టీకి పనిచేయడానికి ముందుకు రావడం శుభ పరిణామం అని తెలియజేశారు రాబోయే రోజుల్లో మనమంతా కలిసి పార్టీని మరింత బలోపేతం చేసుకొని పవన్ కళ్యాణ్ ఆశయాలను చింత సురేష్ నేతృత్వంలో ప్రతి గ్రామంలో ప్రతి గడపకు చేరుద్దామని ఆయన గ్రామస్తులందరికీ పిలుపునిచ్చారు జనసేన పార్టీ చేస్తున్న మంచిని వివరిద్దామని కూటమి ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిని ప్రజలకు వివరిస్తూ ముందుకు సైనికుల్లా కదులుదామని అందరూ కలిసికట్టుగా ఉందామని అందరిని నడిపించే బాధ్యత తన భుజాల మీద వేసుకుంటానని వారు ఈ సందర్భంగా తెలియజేశారు అనంతరం వచ్చిన కార్యకర్తలందరికీ భోజన ఏర్పాట్లు చేశారు ఈ కార్యక్రమంలో జనసేన స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోవాలి

మనగళం, కర్నూలు క్రైం : దసరా పండుగను పురస్కరించుకొని అక్టోబర్ 2 (గురువారం) వ తేది రాత్రి జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరిగే దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవం ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టిందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బన్ని ఉత్సవానికి 800 మంది పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఇందులో 7 మంది డీఎస్పీలు, 50 మంది సీఐ లు, ఆర్ ఐ లు, 59 మంది ఎస్సై లు, ఆర్ ఎస్సైలు , 95 మంది ఎఎస్సై, ఆర్ ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్ళు, ఎఆర్ హెడ్ కానిస్టేబుల్స్ , 200 మంది సివిల్, ఎఆర్ కానిస్టేబుళ్ళు, 18 మంది స్పెషల్ పార్టీ పోలీసులు , 90 మంది హెూంగార్డులు బన్ని ఉత్సవం బందోబస్తు విధులలో పాల్గొంటారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి నిఘా ఏర్పాటు చేసిందన్నారు. బన్ని ఉత్సవంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి, అల్లర్లు, నిప్పులు విసరడం వంటివి చేస్తే అలాంటి వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బన్ని ఉత్సవం అనేది సంప్రదాయం, కర్రల సమరం కాదు, కర్రల సమరం అనేదే లేదు. అది అపోహ మాత్రమేనన్నారు. కర్రల సమరం, కర్రల సమరానికి సమాయత్తం అనే పదాలు మీడియాలో వాడకూడదని వారికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కొందరు సృష్టించినదే , జైత్రయాత్రలో ఊరేగింపుగా వెళ్ళడానికి దేవుని ముందు నాట్యం చేసే దానికి కర్రలతో వెళతారన్నారు. కొందరు వ్యక్తులు మనస్పర్థలతో ఈవిధంగా కర్రలతో దాడులకు పాల్పడడం చేస్తున్నారన్నారు. అటువంటి వారి పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నెరణికి , నెరణికి తాండ, కోత్తపేట గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లేటప్పుడు మా గ్రామానికి విగ్రహాన్ని తీసుకెళ్తే వర్షాలు పడి , పంటలు బాగా పండుతాయనే నమ్మకంతో ఈవిధంగా చేస్తారన్నారు. బన్ని ఉత్సవంలో మద్యం సేవించి రింగులు గల కర్రలతో ఉత్సవంలో పాల్గొనడం వల్ల తలలకు గాయాలు కావడం వంటి దుష్పరిమాణాలపై దేవరగట్టు చుట్టు ప్రక్కల నెరణికి,కొత్తపేట, అరికెర, ఎల్లార్తి, గ్రామాలలో పోలీసు, రెవిన్యూ శాఖల సమన్వయంతో ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. దేవరగట్టు పరిసర గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లు నిర్వహిస్తున్నాము. ముందు జాగ్రత్తల చర్యల్లో భాగంగా ఇంతకు మునుపు ఘర్షణల్లో పాల్పడ్డ వారిని, అక్రమ మద్యం రవాణా చేసే వారిని గుర్తించి 198 మందిని బైండోవర్ చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. దేవరగట్టు చేరుకునే పరిసర గ్రామాల్లోనూ, ప్రధాన రహదారుల్లోనే కాక చిన్న చిన్న దారుల్లోనూ బందోబస్తు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాము. ఉత్సవంలో ఎలాంటి రక్త గాయాలు కాకుండా పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. బన్ని ఉత్సవంలో ఫైర్ సిబ్బంది, వైద్యసిబ్బంది, అంబులెన్స్ సర్వీసులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నాం. బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, భక్తుల్లో మార్పు రావాలని, ఈ కర్రల సమరానికి స్వస్తి పలకాలని దేవరగట్టు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ సంధర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.ఓ




– కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

# పోషకాహారం కోసం జొమాటో సరికొత్త ఫీచర్

మన గళం, ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో సోమవారం కొత్త ఫీచర్‌ను ప్రారంభించింది. కస్టమర్లు ఆర్డర్ చేసే సమయంలో పోషకాలతో ఉన్న ఆహారం ఎంచుకునేందుకు వీలుగా 'హెల్తీమోడ్' అనే ఫీచర్‌ను తీసుకొచ్చింది.ఈ ఫీచర్ ద్వారా కస్టమర్లు ఆర్డర్ చేసే ఫుడ్‌లోని పోషక విలువలకు సంబంధించిన రేటింగ్ తెలుసుకునే అవకాశం ఉంటుంది. వంటకాలకు ప్రొటీన్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, ఫైబర్, సూక్ష్మపోషకాల ఆధారంగా లో నుంచి సూపర్ వరకు ఆరోగ్యకరమైన స్కోరు ఉంటుంది. జొమాటో యాప్ ప్రకారం, ప్రొటీన్ సాంద్రత, పదార్థాల నాణ్యత, వంట పద్ధతి, కార్బోహైడ్రేట్ నాణ్యత, ఇతర అంశాల ఆధారంగా స్కోరు ఉంటుంది. జొమాటో పేరెంట్ ఎటర్నల్ సీఈఓ దీపిందర్ గోయల్ దీని గురించి మాట్లాడుతూ.. కస్టమర్లు ఫుడ్ ఆర్డర్ చేసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేశాం. కానీ ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం అందించేందుకు ఇప్పటిదాకా సరైన అవకాశం లేదు. ఈ లోటును భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే హెల్తీమోడ్ ఫీచర్ ప్రారంభించాం. దీని ద్వారా ఆహార పదార్థాలకు స్కోర్ ఉంటుంది. ప్రస్తుతం ఈ సదుపాయం గురుగ్రామ్‌లో మాత్రమే ఉంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఇతర నగరాల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.





## కొత్త గరిష్టాలకు చేరిన బంగారం, వెండి ధరలు

మన గళం, దేశంలో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డు గరిష్టాలకు చేరుకున్నాయి. సోమవారం దేశ రాజధానిలో వెండి ధరలు ఏకంగా రూ.7,000 పెరిగి కిలోకు రూ.1.50 లక్షలకు చేరుకోగా, బంగారం కూడా రూ.1,19,500కు చేరుకుని కొత్త గరిష్ట స్థాయికి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది.వెండి ధరలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రూ. 1.60 లక్షల(అన్ని పన్నులు కలిపి)కు చేరుకుంది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి రూ. 920 పెరిగి 10 గ్రాములకు రూ.1,19,964 (అన్ని పన్నులతో సహా)గా ఉంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 850 పెరిగి రూ. 1,07,831(అన్ని పన్నులతో సహా)కి చేరింది. గ్లోబల్ మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి ఉంది. బంగారం, వెండి రెండూ భారీగా పెరుగుతున్నాయి. స్పాట్ గోల్డ్ దాదాపు 2 శాతం పెరిగి ఔన్సు 3,824.61 డాలర్లకు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. వెండి ఔన్సు 2 శాతం కంటే ఎక్కువగా పెరిగి 47.18 డాలర్లకు చేరుకుంది. ప్రధానంగా అమెరికా డాలర్ బలహీనపడటం, అమెరికా ఫెడ్ రేట్ల కోత అంచనాలు, భౌగోళిక రాజకీయ, ఆర్థిక అనిశ్చితి, వెండికి పారిశ్రామికంగా అధిక డిమాండ్ ఏర్పడటం, వెండి సరఫరా తగ్గడం, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్లు, రూపాయి విలువ బలహీనపడటం వంటి అంశాలు వెండి, బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి.



## గుండెపోటు ప్రమాదం వీరిలోనే ఎక్కువట..



మన గళం, ప్రపంచవ్యాప్తంగా సైలెంట్ కిల్లర్.. గుండెపోటు కేసులు, మరణాలు వేగంగా పెరుగుతున్నాయి.. గుండెపోటులు వృద్ధులకు లేదా అనారోగ్యంతో ఉన్నవారికి మాత్రమే పరిమితం కాదు.. అవి ఇతరులకు కూడా ప్రమాదాన్ని పెంచుతాయి. కాబట్టి, దీనిని విస్మరించకూడదు. ప్రపంచ హృదయ దినోత్సవం నాడు, ఏ వ్యక్తులకు గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉంది..? ప్రస్తుత కాలంలో.. ముఖ్యంగా యువతలో గుండెపోటు కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 18 మిలియన్ల మంది గుండె సంబంధిత సమస్యల కారణంగా మరణిస్తున్నారు.. వీటిలో గుండెపోటు అత్యంత సాధారణ కారణాలలో ఒకటి. దీనికి ప్రధాన కారణాలు అనారోగ్యకరమైన జీవనశైలి, మానసిక ఒత్తిడి, ధూమపానం, ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం.. జంక్ ఫుడ్ నిరంతరం తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం కూడా గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. దీనితో పాటు, జన్యుపరమైన అంశాలు అంటే కుటుంబంలో గుండె జబ్బుల చరిత్ర ఉండటం కూడా ప్రమాదాన్ని అనేక రెట్లు పెంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అత్యంత సాధారణ లక్షణాలలో ఛాతీ ఒత్తిడి లేదా బిగుతు, ఎడమ చేయి, మెడ లేదా దవడలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, చెమట పట్టడం, తలతిరగడం వంటివి ఉంటాయి. కొంతమందిలో, ఛాతీ బరువు లేదా బలహీనత వంటి లక్షణాలు తేలికపాటివి కావచ్చు.. దీనిని తరచుగా గ్యాస్ లేదా అసిడిటీగా విస్మరిస్తారు. మహిళల్లో గుండెపోటు లక్షణాలు కొద్దిగా భిన్నంగా ఉండవచ్చు, అంటే వెన్ను లేదా కడుపు నొప్పి, వికారం – అసాధారణ అలసట. ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే వైద్య సహాయం తీసుకోండి. ముందస్తుగా గుర్తించడం, సకాలంలో చికిత్స చేయడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చుని.. జైన్ వివరించారు.

## ఇది సాధారణ జ్యూస్ కాదు గ్రీన్ బ్లడ్..!



మన గళం, గోధుమ గడ్డి గురించి చాలాసార్లు వినే ఉంటారు. ఇది ఎక్కడైనా సులభంగా దొరికే కూరగాయ, పండు కాదు. గోధుమ మొక్క. గోధుమల నుంచి తాజాగా మొలకెత్తిన ఆకులు. ఇది సాధారణ గడ్డిని పోలి ఉంటుంది. అందుకే దీనిని గడ్డి అని పిలుస్తారు. అయితే, దాని పోషక విలువలు, ప్రయోజనాలు మాత్రం ఔషధ మూలికల కంటే అధికం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. వైద్య రంగంలో గోధుమ గడ్డి అనేక వీట్‌గ్రాస్‌లో అనేక విటమిన్లు, ఖనిజాలు, అమైనో ఆమ్లాలు, ముఖ్యమైన ఎంజైమ్‌లు ఉన్నాయి. అందుకే దీనిని క్యాన్సర్ నిరోధక ఏజెంట్‌గా పిలుస్తారు. ఇందులో ఇనుము, మెగ్నీషియం, కాల్షియం, అమైనో ఆమ్లాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. గోధుమ గడ్డిలోని పోషకాలు.. శరీరంలోని మలినాలు, టాక్సిన్స్‌ను తొలగిస్తాయి. క్యాన్సర్ కణాలను నివారించడం, తగ్గించడంతో పాటు, గోధుమ గడ్డి రసం తాగడం వల్ల దంత క్షయం నివారించవచ్చు. అధిక రక్తపోటు తగ్గుతుంది. ఆర్థరైటిస్ నొప్పి తగ్గుతుంది. జలుబుకు చికిత్స చేయవచ్చు. వికారం నుండి ఉపశమనం పొందవచ్చు. ఇటీవలి సంవత్సరాలలో గోధుమ గడ్డి అపారమైన ప్రజాదరణ పొందింది. ఎందుకంటే ఇది అనేక వ్యాధుల్ని నివారించడానికి, జీవక్రియ శక్తిని పెంచడానికి, క్యాన్సర్ కణాలను తొలగించడానికి, బరువు తగ్గడానికి, రక్తంలో చక్కెర, రక్తపోటును నియంత్రించడానికి, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. క్యాన్సర్ ఒక ప్రమాదకరమైన, ప్రాణాంతక వ్యాధి. గోధుమ గడ్డి క్యాన్సర్ కణాలను నిరోధించే, తగ్గించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. గోధుమ గడ్డిని ఉపయోగించడం వల్ల క్యాన్సర్‌ను సైతం నివారించవచ్చు అంటున్నారు నిపుణులు. గోధుమ గడ్డిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి.

## రోజూ ఖాళీ కడుపుతో ఓ యాపిల్ పండు తింటే..




మన గళం, రోజుకొక్క యాపిల్ తింటే డాక్టర్‌తో పని ఉండదని వైద్యులు చెప్పడం మీరు అనేక సార్లు వినే ఉంటారు. కెలోరీలు, పీచు, సి-విటమిన్, కాపర్, పొటాషియంలతో యాపిల్ మంచి పోషకాహారం. రోజుకొక్క యాపిల్ తింటే డాక్టర్‌తో పని ఉండదని వైద్యులు చెప్పడం మీరు అనేక సార్లు వినే ఉంటారు. కెలోరీలు, పీచు, సి-విటమిన్, కాపర్, పొటాషియంలతో యాపిల్ మంచి పోషకాహారం. మలబద్ధక సమస్యను నివారిస్తుంది. ఇది రక్తపోటును క్రమబద్ధం చేస్తుంది. అగ్న్యాశయానికి (పాంక్రియాజ్) మంచిది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంట, తాపం, బాధల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మంచి పోషకాలతో దండిగా ఉంటుంది. అందుకే త్వరగా ఆకలి వేయదు.బరువు తగ్గాలనుకునేవారికి యాపిల్ మంచి ఎంపిక. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో ఒక ఆపిల్ తింటే, అది మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.యాపిల్ ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో ఒక యాపిల్ తింటే పెద్ద మొత్తంలో ఫైబర్ అందుతుంది. యాపిల్స్‌లో యాంటీఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. బరువు తగ్గడానికి యాపిల్స్ చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. బరువు తగ్గాలనుకుంటే వీటిని ఖచ్చితంగా మీ ఆహారంలో చేర్చుకోవాలి. రోజూ యాపిల్ తింటే అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేయడంలో కూడా సహాయపడుతుంది.

# గోరు వెచ్చని నీళ్లలో నిమ్మరసం కలిపి తాగితే...



మన గళం, చాలా మంది పొద్దునే గోరువెచ్చని నీటిల్లో నిమ్మకాయ రసం కలుపుని తాగుతారు. గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ కలిపి తాగడం ఆరోగ్యానికి నిజంగా మంచిదో? కాదో? చాలా మందికి క్లారిటీ ఉండదు. దీని గురించి ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారంటే.. చాలా మంది పొద్దునే గోరువెచ్చని నీటిల్లో నిమ్మకాయ రసం కలుపుని తాగుతారు. నిజానికి, గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ కలిపి తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను నయం చేయడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడానికి గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ కలిపి తాగడం చాలా మంచిది. ముఖ్యంగా,ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రతిరోజు ఉదయం గోరువెచ్చని నీటిలో నిమ్మకాయ రసం కలిపి తాగడం ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## పొద్దున్నే ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం మంచిదే..



మన గళం, ఇంట్లో పెద్దలు చాలా మందికి పొద్దున్నే నిద్రలేవగానే గ్లాసుడు నీళ్లు తాగడం అలవాటు. నిజానికి, ఖాళీ కడుపుతో నీరు తాగడం ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి . ఈ అలవాటు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ ఇది అందరికీ సరిపోదు. ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు నీళ్లు తాగడం చాలా మందికి అలవాటు. ఇంట్లో పెద్దలు చాలా మంది ఈ అలవాటును పాటిస్తుంటారు. నిజానికి, ఖాళీ కడుపుతో నీరు తాగడం ఆరోగ్యకరమైన అలవాట్లలో ఒకటి . ఈ అలవాటు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ ఇది అందరికీ సరిపోదు. ఉదయం ఖాళీ కడుపుతో నీరు తాగడం మంచి అలవాటు అయినప్పటికీ కొంతమంది ఆరోగ్యానికి ఇది మంచిది కాదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఉదయం నీరు తాగే అలవాటు కూడా మంచిదే కదా? ఈ ప్రశ్న చాలా మందిలో తలెత్తవచ్చు. నీళ్లు త్రాగడం ఖచ్చితంగా చెడు అలవాటు కాదు. కానీ కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు నిద్ర లేచిన వెంటనే ఖాళీ కడుపుతో నీళ్లు తాగడం వారి ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. దీని వల్ల ప్రయోజనం కంటే హాని ఎక్కువట. కాబట్టి ఖాళీ కడుపుతో నీరు తాగే అలవాటును ప్రారంభించే ముందు వైద్యులను సంప్రదించడం మంచిది. సాధారణంగా నోటి లేదా దంత వ్యాధులు ఉన్నవారు ఖాళీ కడుపుతో నేరుగా నీళ్లు తాగకూడదు. పయోరియా (చిగుళ్ల వ్యాధి), నోటి పూత, నోటి క్యాన్సర్ వంటి సమస్యలు ఉన్నవారు అస్సలు ముట్టుకోకూడదు. ఈ వ్యాధులు ఉన్నవారిలో నోటిలోని లాలాజలంలో హానికరమైన అంశాలు ఉంటాయి. ఇవి ఇన్ఫెక్షన్లకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి వారు ఉదయం నిద్రలేచిన వెంటనే నీరు తాగితే, నీటితో పాటు లాలాజలాన్ని మింగితే, హానికరమైన అంశాలు శరీరంలోకి ప్రవేశిస్తాయి. అందువల్ల ఇటువంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నీరు తాగే ముందు నోటిని బాగా శుభ్రం చేసుకోవాలి. అప్పుడు నోటిలోని బ్యాక్టీరియా, విషపూరిత పదార్థాలు తొలగిపోతాయి. ఆ తర్వాత నీళ్లు తాగడం సురక్షితంగా ఉంటుంది. ఆరోగ్యవంతులైన వ్యక్తులు లాలాజలాన్ని ఉమ్మివేయడం కంటే మింగడం మంచిది. ఎందుకంటే లాలాజలంలోని ఎంజైమ్‌లు జీర్ణ ప్రక్రియను సులభతరం చేస్తాయి. శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అందువల్ల అనవసరంగా లాలాజలాన్ని ఉమ్మివేయడం ఆరోగ్యానికి హానికరం. ఖాళీ కడుపుతో సరిగ్గా నీరు తాగడం, నోటి పరిశుభ్రతను కాపాడుకోవడం వల్ల మొత్తం ఆరోగ్యం మెరుగుపడుతుంది.

## ఈ వ్యాధిగ్రస్తులు బెండకాయ తినేముందు ఆలోచించండి



మన గళం, మన రోజువారీ ఆహారంలో తీసుకునే కూరగాయాల్లో బెండకాయ కూడా ఒకటి. ఇందులో ఉండే అనేక రకాల పోషకాల మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. కానీ ఈ బెండకాయ అందరికి ఒకే రకమైన ప్రయోజనాలను అందించలేదని.. కొందరికి దీనిని తినడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. మన రోజువారీ ఆహారంలో తీసుకునే కూరగాయాల్లో బెండకాయ కూడా ఒకటి. ఇందులో ఉండే అనేక రకాల పోషకాల మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా బెండకాయలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ మెరుగుపరుస్తుంది, మలబద్ధక సమస్య నుంచి ఉపసమనం కలిగిస్తుంది. అలాగే ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్ లక్షణాలు కాలేయాన్ని ఫ్రీ రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి. గుండె సమస్యల చికిత్సలో చురుకైన పాత్ర పోషించే పాలీఫెనాల్స్ ఉన్నందున గుండె జబ్బులతో సంబంధం ఉన్న వాపును తగ్గించడానికి కూడా ఇది చాలా మంచిది. కానీ బెండకాయ తినే ముందు మీరు కొన్ని విషయాలు తెలుసుకోవలసి ఉంటుంది. ఇది ఎల్లప్పుడూ అందరికీ మంచిది కాకపోవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కొన్ని వ్యాధులు ఉన్నవారికి ఇది ప్రతికూల ప్రభావాలను కలిగిస్తుంది. దీని గురించి డాక్టర్ అనిల్ పటేల్ మాట్లాడుతూ.. మూత్రపిండాల్లో రాళ్లు, ఆర్థరైటిస్, జీర్ణ రుగ్మతలు ఉన్నవారు బెండకాయ తినేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. వైద్యుల సలహా మేరకు మాత్రమే వీరు వాటిని తినాలి.. లేదంలో వీరు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని చెబుతున్నారు. బెండకాయలో అధిక స్థాయిలో ఆక్సలేట్లు ఉంటాయి. ఇది శరీరంలోని కాల్షియంతో కలిసి కాల్షియం ఆక్సలేట్ రాళ్లను ఏర్పరుస్తాయి. ఇవి సాధారణంగా మూత్రపిండాలలో కనిపించే రాళ్ళు. ఇప్పుడు, మీకు వంశపారంపర్యంగా ఆరోగ్య సమస్య ఉంటే, బెండకాయను తినకుండా ఉండటం మంచిది. మీరు దానిని తింటుంటే, చాలా తక్కువ పరిమాణంలో మాత్రమే తినండి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం వల్ల కీళ్ల వాతం వస్తుంది. దీనివల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. బెండకాయలో ఉండే ఆక్సలేట్లు యూరిక్ యాసిడ్ స్ఫటికీకరణకు సహాయపడతాయి. దీని వల్ల మీ పరిస్థితి మరింత దిగజార్చవచ్చు. కీళ్లవాతంతో బాధపడేవారు బెండకాయల పూర్తిగా దూంగా ఉండండి. ముఖ్యంగా సీతాకాలంలో వాటి జోలికి అస్సలూ వెళ్లకండి. బెండకాలలో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ, గ్యాస్, ఉబ్బరం, ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్, అజీర్ణం వంటి సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి. ఎందుకంటే బెండకాయ తినడం వల్ల వారి సమస్యలు మరింత పెరగవచ్చు. అలా కాదని మీరు బెండకాయలను తింటే కడుపు నొప్పి, అసౌకర్యం కలుగుతాయి. ఈ పరిస్థితులు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే బెండకాయలను మీ హారంలో చేర్చుకోండి.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక



# ‘మ్యాంగో పచ్చ’ సినిమా టీజర్ అప్డేట్ ఇచ్చిన కాజల్

మనగళం, కన్నడ యంగ్ హీరోయిన్ కాజల్ కుందర్ వరుస అవకాశాలు అందుకుంటూ క్రేజీ బ్యూటీగా మారింది. ప్రస్తుతం ఈ అమ్మడు ‘మ్యాంగో పచ్చ’ సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ మూవీతో కన్నడ స్టా( కిచ్చా సుదీప్ మేనల్లుడు సంచిత్ సంజీవ్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఇందులో మాలాశ్రీ, మయూర్ పటేల్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. వివేకా దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రాన్ని సుప్రియాన్వి పిక్చర్స్, కెఆర్జి స్టూడియోస్ బ్యానర్స్‌పై కార్తీక్, యోగి రాజ్, సుప్రియాన్వి నిర్మిస్తున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నవంబర్ 5న విడుదల కాబోతుంది. ఈక్రమంలో.. తాజాగా, ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన కాజల్ అప్డేట్స్ రిలీజ్ చేస్తోంది. ‘మ్యాంగో పచ్చ’ టీజర్ సెప్టెంబర్ 12: 34గంటలకు రాబోతున్నట్లు తెలుపుతూ.. ప్రపంచంలోకి ‘మ్యాంగో పచ్చ’ మొదటి అడుగు పడబోతోంది. దీనిని కిచ్చా సుదీప్ లాంచ్ చేయనున్నారు అని వెల్లడించింది. దీంతో నెటిజన్లు ఫైర్ ఎమోజీలు షేర్ చేస్తున్నారు.

# ‘సంబరాల ఏటిగట్టు’ నుంచి అప్డేట్..



మనగళం, మెగా హీరో సాయి ధరమ్ తేజ్, ఐశ్వర్య లక్ష్మి జంటగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ‘సంబరాల ఏటిగట్టు’. ఈ సినిమా సెప్టెంబర్ 25న విడుదల కావాల్సి ఉండగా పలు కారణాల వల్ల వాయిదా పడింది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మూవీ మేకర్స్ వరుస అప్డేట్స్ రిలీజ్ చేస్తూ అంచనాలను పెంచుతున్నారు. తాజాగా, ‘సంబరాల ఏటిగట్టు’కు సంబంధించిన అప్డేట్ రాబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. అక్టోబర్ 15న సాయి ధరమ్ తేజ్ పుట్టినరోజు కానుకగా.. అభిమానులకు సర్‌ప్రైజ్ ఇవ్వబోతున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ.. “అసుర ఆగమనానికి ముహూర్తం ఫిక్స్ అయింది. అభిమానుల కోసం ‘సంబరాల ఏటిగట్టు’ టీమ్ స్పెషల్‌గా కుక్ చేయబోతున్నారు. ఈ సారి అది మీ అంచనాలను మించి ఉండబోతుంది” అనే క్యాప్షన్ జత చేసి ఆసక్తిని పెంచారు. కాగా.. రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఇందులో టాలీవుడ్ హీరో శ్రీకాంత్ విలన్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



# ‘ఆర్యన్’ టీజర్ అప్డేట్ ఇచ్చిన మేకర్స్

మనగళం, కోలీవుడ్ హీరో విష్ణు విశాల్ ఏకంగా ఆరు భారీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టి ఫుల్ బిజీ బిజీగా గడుపుతున్నాడు. విభిన్న కథలు ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. విష్ణు విశాల్ నటిస్తున్న సినిమాల్లో ‘ఆర్యన్’ ఒకటి. ప్రవీణ్ దర్శకత్వంలో రాబోతున్న ఈ మూవీని ఆర్యన్ రమేష్, సుబ్రా సమర్పణలో విష్ణు విశాల్ స్టూడియోస్ నిర్మిస్తోంది. ఇందులో శ్రద్ధా శ్రీనాథ్, వాణి భోజన్ హీరోయిన్లుగా నటిస్తుండగా.. డైరెక్టర్ సెల్వరాఘవన్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. యాక్షన్ చిత్రంగా తెరకెక్కుతుండగా.. ‘ఆర్యన్’లో విష్ణు విశాల్ పవర్ ఫుల్ పోలీస్ అధికారిగా నటిస్తున్నాడు. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన టీజర్ సెప్టెంబర్ 30న విడుదల కాబోతున్నట్లు తెలుపుతూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. ఇక ఇందులో విష్ణు విశాల్ గన్ పట్టుకుని కూర్చొని ఉండగా.. చుట్టూరా మాస్క్ ధరించిన కొంతమంది వ్యక్తులు ఉన్నారు. పోస్టర్‌లో.. “పర్‌ఫెక్ట్ పోలీస్ ఆఫీసర్.. ఓ హత్య కేసులోని నేరగాళ్లను పట్టుకోగలడు. రేపు ఫస్ట్ క్లూ ఇవ్వబోతున్నాం” అని రాసుకొచ్చారు. ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో అక్టోబర్ 31న థియేటర్స్‌లోకి రాబోతుంది.

# పోస్టర్‌తో సర్‌ప్రైజ్ ఇచ్చిన ప్రశాంత్ వర్మ





మనగళం, టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ ‘హనుమాన్’ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలవడంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను కనీవిని ఎరుగని రీతిలో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కించే పనిలో ప్రశాంత్ వర్మ ఫుల్ బిజీ అయిపోయారు. దీంతో పాటు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి మూడీ ప్రాజెక్ట్‌గా ఓ పవర్ ఫుల్ స్టోరీ ‘మహాకాళి’ కూడా రాబోతుంది. బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాల ఆధారం, మతపరమైన గంభీరత, స్థానిక పౌరాణిక చరిత్రలతో అనుసంధానం చేయబడింది. ఇక ఈ మూవీకి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజా అపర్ణ దర్శకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదలవగా.. మంచి రెస్పాన్స్‌ను దక్కించుకుంది. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ‘మహాకాళి’ అప్డేట్స్ కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ప్రశాంత్ వర్మ ఈ సినిమాకు సంబంధించిన అప్డేట్ ఇచ్చి ప్రేక్షకులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రంలో ‘ఛావా’ విలన్ అక్షయ్‌ఖన్నా నటిస్తున్నట్లు తెలుపుతూ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. ఆయన ఇందులో అశ్వగురు శుక్రచార్యగా నటిస్తున్నట్లు వెల్లడిస్తూ.. “దేవతల నీడలలో..తిరుగుబాటుకు ప్రకాశవంతమైన జ్వాల పెరిగింది” అనే క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను రెట్టింపు చేస్తోంది.

# స్టార్ హీరో కూతురు... డైరెక్టర్

మనగళం, సినీ కటుంబాలకు చెందిన వాళ్లు.. ఈ ఇండస్ట్రీని కాదనుకుని వేరే రంగాల వైపు వెళ్లడం ఇప్పుడు అరుదు. ఇక్కడ సక్సెస్ రేట్ చాలా తక్కువైనా సరే.. వారసులు ఇందులోకే వస్తుంటారు. హీరోల కొడుకులు హీరోలవడం చాలా కామన్. ఒకప్పటితో పోలిస్తే అమ్మాయిలు కూడా నటన వైపు ఎక్కువగానే వస్తున్నారు. ఐతే సినిమాకు సంబంధించి అత్యంత కష్టమైన వ్యవహారం అయిన దర్శకత్వం చేయడం అంటే అంత తేలికైన విషయం కాదు. దానికి అసాధారణ నైపుణ్యం ఉండాలి, అలాగే ఎంతో కసరత్తు చేయాలి. మరి ఆ నైపుణ్యాలు ఉండి, కసరత్తు కూడా చేసినట్లే కనిపిస్తోంది తమిళ స్టార్లు సూర్య, జ్యోతికల ముద్దుల కూతురు దియ. అమ్మా నాన్నల సినీ వారసత్వాన్ని స్వీకరించిన ఈ అమ్మాయి 17 ఏళ్లకే డైరెక్టర్ అయిపోయింది. కాకపోతే తొలి ప్రయత్నంగా ఆమె తీసింది ఫీచర్ ఫిలిం మాత్రం కాదు. అదొక డాక్యుమెంట్ డ్రామా. ‘లీడింగ్ లైట్’ పేరుతో 13 నిమిషాల డాక్యుమెంట్ డ్రామాను దియా రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ 24 సినిమా క్రాఫ్ట్‌లోని ఒక ప్రత్యేక విభాగం గురించి కావడం విశేషం. ఒక సినిమా తెరకెక్కడం వెనుక ప్రతి విభాగం కష్టం ఎంతో ఉంటుంది. అందులో లైటింగ్ పాత్ర ఎంతో కీలకం. ఇందులో ఎక్కువగా మగవాళ్లే పని చేస్తారు. ఈ విభాగంలో ముగ్గురు మహిళలు అడుగు పెట్టి ఎలా సక్సెస్ అయ్యారనే పాయింట్ మీద ‘లీడింగ్ లైట్’ డాక్యుడ్రామాను రూపొందించింది దియా. సూర్య, జ్యోతికల సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్టైన్మెంట్స్ దీన్ని ప్రొడ్యూస్ చేసింది. అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో ఆస్కార్ క్వాలిఫయింగ్ రన్‌లో భాగంగా ఈ డాక్యుమెంటరీని ప్రదర్శించడం విశేషం. అక్కడ దీనికి విమర్శకుల ప్రశంసలు దక్కుతున్నాయి. వచ్చే సంవత్సరానికి అకాడమీ అవార్డుల్లో డాక్యుమెంటరీ విభాగంలో ‘లీడింగ్ లైట్’ పోటీ పడే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో దియా ఫీచర్ ఫిలిం డైరెక్టర్ కావడం లాంఛనమే అంటున్నారు.



## గుంటూరు యువ షూటర్ ముఖేష్‌కు రజతం




మనగళం, ఈనెల 24నుంచి జరుగుతున్న జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ పోటీల్లో గుంటూరుకు చెందిన నేలవల్లి ముఖేష్ రజత పతకంతో మెరిశాడు. సోమవారం 25మీ. ర్యాపిడ్ ఫైర్ ఫైనల్లో షూట్ ఆఫ్‌లో ఓటమిపాలయ్యాడు. షూట్ ఆఫ్‌లో ముఖేష్ 3-1 తేడాతో పరాజయాన్ని చవిచూశాడు. రష్యాకు చెందిన కోవలేవ్ బంగారు పతకం గెలుచుకోగా.. ముఖేష్‌కు రజత పతకం దక్కింది. న్యూట్రల్ అథ్లెట్‌గా ఈ వరల్డ్ కప్‌లో బరిలోకి దిగిన అలెగ్జాండర్ కొవలేవ్‌కు బంగారు పతకం లభించింది. ఇండియాకు చెందిన సూరజ్ శర్మ కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ముఖేష్ 571/600 పాయింట్ల స్కోర్‌తో మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్ల మధ్య జరిగిన ఫైనల్ ఉత్కంఠ భరతంగా సాగింది. ఆరో రౌండ్‌లో సూరజ్ శర్మకు కాంస్య పతకం ఖరారు కాగా.. ఏడవ రౌండ్‌లో ముఖేష్, కోవలేవ్ ఇద్దరు 27 పాయింట్లతో సమంగా నిలిచారు. ఫలితం కోసం షూట్ ఆఫ్ నిర్వహించగా... ముఖేష్ పరాజయాన్ని చవిచూశాడు. ముఖేష్ గత ఏడాది అక్టోబర్‌లో పెరు వేదికలో జరిగిన జూనియర్ ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 5 బంగారు పతకాలు 2 కాంస్య పతకాలు సాధించాడు. అలాగే 2025 మేలో జర్మనీలో జరిగిన ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 25మీ. రాపిడ్ ఫైర్ జూనియర్ విభాగంలో కాంస్య పతకం, ఆగస్టులో కజకిస్తాన్‌లో జరిగిన ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 3 బంగారు పతకాలు ఒక రజత పతకం సాధించి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు.

# సూర్యను కాపీ కొట్టబోయి బుక్కైన పాక్ కెప్టెన్..




మనగళం, ఆసియా కప్ మొత్తం మ్యాచ్ ఫీజును భారత ఆర్మీకి అందజేస్తానని టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ తెలిపాడు. పాక్‌తో ఫైనల్‌లో గెలిచిన తర్వాత ఏర్పాటు చేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్య మాట్లాడుతూ.. ట్రోఫీ తిరస్కరించడంపై స్పందించాడు.’నాకు తెలిసినంత వరకు చాంపియన్ జట్టు ట్రోఫీని తిరస్కరించడం మొదటిసారి చూస్తున్నా. టైటిల్ మాకు అంత సులభంగా దక్కలేదు. చాలా కష్టపడి సాధించాం. కాబట్టి, ట్రోఫీకి మేము అర్హులం.’అని తెలిపాడు. ప్లేయర్లు, సపోర్టింగ్ స్టాఫే నాకు నిజమైన ట్రోఫీలు అని చెప్పాడు. ‘ట్రోఫీల గురించి నన్ను అడిగితే.. నా ట్రోఫీలు డ్రెస్సింగ్ రూంలో ఉన్నాయి. ఆసియా కప్ ప్రయాణంలో భాగమైన 14 మంది ఆటగాళ్లు, సపోర్టింగ్ స్టాఫ్‌కు నేను నిజమైన అభిమానిని. వారే నాకు ట్రోఫీలు. నిజమైన ట్రోఫీలు. ఎప్పటికీ నిలిచిపోయే జ్ఞాపకాలు’అని తెలిపాడు. అలాగే, ఆసియా కప్ ట్రోఫీ ఇమేజీతో ఉన్న ఫొటోను సూర్య ఇన్‌స్టాలో పంచుకున్నాడు. ‘మ్యాచ్ ముగిశాక చాంపియన్లే గుర్తుంటారు. ట్రోఫీలు కాదు.’అని క్యాప్షన్ ఇచ్చాడు. అవార్డు ప్రెజెంటేషన్‌లో పాక్ కెప్టెన్ అఘా సల్మాన్ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రన్నరప్ ప్రైజ్‌మనీ చెక్ తీసుకున్న అతను ప్రెజెంటర్‌తో మాట్లాడటానికి వెళ్లేటప్పుడు ఆ చెక్‌ను దూరంగా విసిరేశాడు. క్రీడా స్ఫూర్తి గురించి మాట్లాడే సల్మాన్ ఇప్పుడు ఇలా వ్యవహరించడంపై క్రికెట్ ఫ్యాన్స్ అతన్ని ఏకిపారేస్తున్నారు. అంతటితో ఆగని అతను సూర్యను కాపీ కొట్టాలని చూసి బుక్కయ్యాడు. తన మ్యాచ్ ఫీజును ఆపరేషన్ సిందూరులో మరణించిన వారి కుటుంబాలకు ఇస్తామని ప్రకటించాడు. ఉగ్రవాదులే లక్ష్యంగా భారత ఆర్మీ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూరులో చనిపోయింది కూడా ఉగ్రవాదాలేనని అందరికీ తెలుసు. ఇప్పుడు సల్మాన్ తన మ్యాచ్ ఫీజును వాళ్లకు ఇచ్చి ఉగ్రవాదానికి తమ మద్దతు ప్రకటించినట్టు అయ్యింది. దీంతో సల్మాన్‌పై భారత అభిమానులు మండిపడుతున్నారు. అసలు బుద్ది చూపించావంటూ కామెంట్లు పెడుతున్నారు.

## భారత్‌తో టెస్టు సిరీస్‌కి ముందు వెస్టిండీస్‌కు షాక్!

మనగళం, ఆసియా కప్ ముగియగానే క్రికెట్ అభిమానులకు మరో పండుగలా భారత్ మరో సిరీస్‌తో ముందుకొస్తోంది. అక్టోబర్ 2 నుంచి టీమిండియా ఒం వెస్టిండీస్ మధ్య రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో తొలి టెస్టు అక్టోబర్ 2-6 మధ్య అహ్మదాబాద్‌లో, రెండో టెస్టు అక్టోబర్ 10-14 మధ్య ఢిల్లీలో జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు తమ తమ స్క్వాడ్‌లను ప్రకటించాయి. విండీస్ ఆటగాళ్లు నాలుగు రోజుల ముందే అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. అయితే, సిరీస్ ఆరంభానికి ముందు వెస్టిండీస్ జట్టుకు షాక్ తగిలింది. కీలక పేసర్ అల్జారీ జోసెఫ్ వెన్ను గాయంతో సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని వెస్టిండీస్ క్రికెట్ బోర్డు అధికారికంగా వెల్లడించింది. అతడి స్థానంలో జెడియా బ్లేడ్స్‌ను జట్టులోకి తీసుకున్నట్టు ప్రకటించింది. జెడియాకు ఇప్పటివరకు టెస్టు అనుభవం లేదు. అయితే వన్డేలు, టీ20ల్లో కలిపి 7 మ్యాచ్‌లు ఆడి నాలుగు వికెట్లు తీశాడు. అంతకుముందు ఈ సిరీస్ కోసం ఎంపికైన మరో పేసర్ షమర్ జోసెఫ్ గాయపడటంతో, అతని స్థానంలో పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ జోహన్ లేన్‌ను తీసుకున్నారు.

# మా వాళ్లకు ఎలా ఆడాలో తెలియదు.. ఇంకా చాలా నేర్చుకోవాలి’:




మనగళం, ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ లో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ అదరగొట్టిన విషయం తెలిసిందే. ఫైనల్‌లో పాకిస్తాన్‌పై భారత్‌ను గెలిపించడంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా తిలక్ వర్మపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ అమీర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఒత్తిడిలో కూడా తిలక్ అద్భుతంగా రాణించారని అన్నారు. భారత జట్టు టాప్ ఆర్డర్ విఫలమైన వేళ తిలక్ ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించి.. ఇండియాకు ఆసియా కప్ అందించారని కొనియాడారు. అతనికి పాకిస్తాన్‌పై గెలవాలనే కసితో పాటు ఆట మీద సంపూర్ణ అవగాహన కూడా ఉందని అన్నారు. పాకిస్తాన్ బ్యాటర్లు ఇంకా చాలా నేర్చుకోవాలి. ఎప్పుడు ఏ షాట్ ఆడాలో ఇంకా పూర్తిగా తెలియడం లేదు. తిలక్ స్మార్ట్ క్రికెట్ ఆడారు. అదే క్రమంలో జట్టుకు విజయాన్ని అందించి హీరోగా నిలిచారని అమీర్ ప్రశంసించారు. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# ఇండియా ఒం పాకిస్తాన్ మ్యాచ్ డేట్, ఖరారు




మనగళం, క్రికెట్ అభిమానులకు మళ్లీ మజా ఖాయం! ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ పాక్‌ను మూడు సార్లు ఓడించి, హ్యాట్రిక్ విజయాలతో అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఫైనల్ మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌పై గెలుపొంది ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది. ఇప్పుడు మళ్లీ భారత్, పాకిస్థాన్ జట్లు టీ20 ఫార్మాట్‌లో తలపడనున్నాయి. 2026 మెన్స్ టీ20 వరల్డ్ కప్ ఫిబ్రవరి 7 నుండి మార్చి 8 వరకు జరగనుండగా, భారత్ మరియు శ్రీలంక ఈ టోర్నమెంట్‌కు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తాయి. మొత్తం 20 జట్లు ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడతాయి. భారత్‌లో కనీసం ఐదు వేదికలపై, శ్రీలంకలో రెండు వేదికలపై మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్ లేదా కొలంబోలో నిర్వహించే అవకాశం ఉంది. ఐసీసీ షెడ్యూల్‌ను ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, విశ్లేషకుల అంచనా ప్రకారం ఫిబ్రవరి 27న బంగ్లాదేశ్ ఒం న్యూజిలాండ్ మధ్యాహ్నం 3 గంటలకు మొహాలీలో, అదే రోజున రాత్రి 7:30కి భారత్ ఒం పాకిస్థాన్ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనున్నట్టు భావిస్తున్నారు. ఇప్పటికే భారత్, శ్రీలంక, పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, యూఎస్ఏ, వెస్టిండీస్, ఐర్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ సహా 15 జట్లు టోర్నీలోకి అర్హత సాధించాయి. అందులో ఇటలీ తొలిసారి టీ20 వరల్డ్ కప్‌కి అర్హత పొందడం విశేషం. మిగిలిన ఐదు స్థానాలు క్వాలిఫయింగ్ టోర్నీల ద్వారా నిర్ణయించనున్నారు ా వాటిలో రెండు ఆఫ్రికా రీజినల్ క్వాలిఫయర్ నుంచి, మిగిలిన మూడు ఆసియా మరియు ఈస్ట్ ఆసియా-పసిఫిక్ క్వాలిఫయర్‌ల నుంచి ఎంపికవుతాయి. ఈ టోర్నీ ఫార్మాట్ గత 2024 టీ20 వరల్డ్ కప్ లాగే ఉండనుంది. మొత్తం 20 జట్లు నాలుగు గ్రూపులుగా విభజించబడతాయి, ప్రతి గ్రూపులో ఐదేసి జట్లు ఉంటాయి. గ్రూప్ దశలో టాప్ 2 జట్లు సూపర్ 8కు అర్హత పొందతాయి. అనంతరం రెండు సూపర్ 8 గ్రూపులు రూపొందించి, వాటి నుంచి టాప్ 2 జట్లు సెమీఫైనల్స్‌కి, తర్వాత ఫైనల్‌కు వెళతాయి. భారత్ ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. 2024లో బార్బడోస్‌లో జరిగిన ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి భారత్ ట్రోఫీ గెలుచుకుంది. ఆ టోర్నీలో మొత్తం 55 మ్యాచ్‌లు నిర్వహించబడ్డాయి.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310